క్లుప్తంగా

బియ్యానికి బదులుగా రాగులు, జొన్నలు

రాయచోటి టౌన్ : డిసెంబర్ నెలకు ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యానికి బదులుగా రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకొక్క కార్డుకు ఒక కేజీ నుంచి 3 కేజీల వరకు రాగులు/జొన్నలు తీసుకోవచ్చుని చెప్పారు. మిగిలిన బియ్యం ఉచితంగా పొందవచ్చుని తెలియచేశారు. ఈ మేరకు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

29న సామాజిక తనిఖీ

లక్కిరెడ్డిపల్లె : ఈనెల 29వ తేదీన 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణా రెడ్డి సోమవారం తెలియజేశారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, పంచాయతీ రాజ్, గృహనిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది తప్పక హాజరుకావాలని వారు కోరారు.

'ఆడుదాం ఆంధ్ర'

చిన్నమండెం : డిసెంబర్ 2వ తేదీ నుంచి జరుగనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీఓ దివ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పీఈటీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఔత్సాహికులను గుర్తించి పోటీలలో పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. పీఈటీ వీరాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

సంబేపల్లె : మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక చేయబడింది. మండల అధ్యక్షుడిగా కె.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తిరుపాల్ నాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలానే గౌరవ అధ్యక్షుడిగా గంగిరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రాజారెడ్డి, సీపీఎస్ కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి ఎన్నుకున్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు వాడాలి

నందలూరు (రాజంపేట) : మండలంలోని దేవాలయాలలో పెద్దలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో దేవాలయాలలో చోరీలు జరిగిన నేపథ్యంలో దేవాలయాలలో సీసీ కెమెరాలు వాడాలని లేనిపక్షంలో దేవాలయాలకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులు అక్కడే బస చేసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ పూజారులు దేవతామూర్తుల ఆభరణాలు, హుండీలోని డబ్బులు దేవాలయం తరఫున బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి అందులో డిపాజిట్ చేసుకోవాలన్నారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలను అరికడతామన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆకేపాటి కాలిబాట

రాజంపేట రూరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి 21వ పర్యాయం గోవింద దీక్షను చేపట్టారు. తిరుమల మహా పాదయాత్రను డిసెంబరు 15న చేపట్టనున్నట్లు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తెలియజేశారు. డిసెంబరు 18న కుక్కలదొడ్డి వద్ద నుంచి అన్నమయ్య కాలిబాట గుండా తిరుమలకు వెళ్లనున్నట్టు తెలియజేశారు.

అన్నదానం

నందలూరు (రాజంపేట) : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని శ్రీ సౌమ్యనాథ స్వామి అన్నదాన ట్రస్టు కోశాధికారి చక్రాల రామసుబ్బన్న పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ, అరవపల్లి గ్రామానికి చెందిన దివంగత అలిశెట్టి చిన్నమ్మ ఎనిమిదవ వర్ధంతిని పురస్కరించుకొని ఆమె జ్ఞాపకార్థం ఆమె కుమారుడు బాలాజీ శివశంకర్ సౌమ్యనాథ ఆలయం ఎదురుగా ఉన్న ఓ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు నల్లపరెడ్డిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెనగలూరు : మండలంలోని నల్లపరెడ్డిపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వర ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు బుట్టిరెడ్డిగారిపల్లె, నడింపల్లి, అరుంధతివాడ, ఎస్టీ కాలనీ, ముండ్లవారిపల్లి, నల్లపరెడ్డిపల్లి దళితవాడలలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి

వీరబల్లి (రాయచోటి టౌన్) : ఆడుదాం ఆంధ్రలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చుని ఎంపీడీఓ మల్లీశ్వరి కోరారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో పేర్లు నమోదు చేసుకవడానికి వలంటీర్ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. అయితే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆటలు ఆడేందుకు ఇతరా గ్రామాల నుంచి వచ్చే వారు అర్హులు కాదని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

భక్తులతో కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

- కార్తీక పౌర్ణమి, కార్తీక సోమవారం కావడంతో ఆది దంపతుల కల్యాణాలు
- నోములు నోచి కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు
- అన్నదానం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు


రైల్వేకోడూరు అర్బన్: అలంకారంలో మల్లికార్జునుడు


రాజంపేట టౌన్: అలంకరణలో రామలింగేశ్వరుడు


ఓబులవారిపల్లె: పూజలందుకున్న నీలకంఠేశ్వరుడు


సంబేపల్లె మండలం మోటకట్ల శివాలయంలో..


రాజంపేట టౌన్: సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


సిద్దవటం : నీలకంఠేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


రాయచోటి టౌన్: వీరభద్రుడి పల్లకీ సేవలో పాల్గొన్న భక్త జనం

సిద్ధవటం : మండలం లోని కనుమలోపల్లె గ్రామ సమీపాన వెలసిన శ్రీ ఉమాదేవి సహిత నీలకంఠేశ్వర స్వామి, అష్టోత్తర(108) మహాలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో రెండవ కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమిని పురష్కరించుకొని శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల ఉత్సవమూర్తులను అలంకరించి వేదికపైకి చేర్చారు. వేదపండితుల వేదమంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ నిర్వాహకులు సోమాబాబు అన్నదానం ఏర్పాటు చేశారు. అలానే మండలంలోని ఇతర శైవ క్షేత్రాల్లో భక్తుల తాకిడి కనిపించింది. మహిళలు నోములు నోచి, కార్తీక దీపాలను వెలిగించారు.

చిన్నమండెం : మండల పరిధిలోని పలు శివాలయాలలో కార్తీక పౌర్ణమి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్నానాలు ఆచరించి సమీప ఆలయాలలో కార్తీక దీపాలను మహిళలు వెలిగించారు. అనంతరం ముక్కంటీశ్వరుడిని దర్శించుకున్నారు.

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు భక్తిశ్రద్ధలతో శివలింగం రూపంలో దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అన్ని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తకన్నప్ప జన్మస్థలి ఊటుకూరులో భక్త కన్నప్ప పూజించి, ఆరాధించిన శివాలయంలో మహిళలు శివలింగం ఆకారంలో కార్తీక దీపాలను వెలిగించారు.

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో సోమవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే నాగ సత్యనారాయణ గుప్తా నేతృత్వంలో ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు విశేష పూజలు జరిపారు. వ్రతాన్ని పురస్కరించుకొని పురోహితులు స్వామివారి కథను వివరించారు. అనంతరం రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.

పుల్లంపేట : రెండో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని పుల్లంపేటలోని శ్రీ పర్వతవర్ధిని శాంతిలింగేశ్వరస్వామి ఆలయం, అనంతంపల్లి శివాలయం, పుత్తనవారిపల్లి శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే మహిళలు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. మధ్యాహ్నం అనంతంపల్లి శివాలయంలో గౌరీ శంకర్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి మహిళలు శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించారు.

అంగరంగ వైభవంగా గుగ్గిల పూజోత్సవం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన గుగ్గిల పూజలు కనుల పండువగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో కర్నాటక రాష్ట్రంలోని వీరగాసి వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణమంతా శివనామ స్మరణలతో మార్మోగింది. అంతకుముందుగా అఘోరలింగేశ్వరుడికి అభిషేకాలు, పూజలు, నిర్వహించారు. అలాగే వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళి అమ్మవారికి పూజలు చేసి అలంకరించారు. పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలి వచ్చారు. కాగా ఆదివారం రాత్రి వీరభద్రుడికి పల్లకీ సేవ నిర్వహించారు.

రాజంపేట టౌన్ : ఈ ఏడాది కార్తీమాసంలో వచ్చిన రెండవ సోమవారంలో కార్తీక పౌర్ణమి కూడా ఉండటంతో భక్తులకు శివాలయాలకు పెద్దఎత్తున తరలి వచ్చారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు తరలిరావడంతో శివాలయాలు కిక్కిరిశాయి. పౌర్ణమితో కూడిన సోమవారం కావడంతో శివాలయాల్లోని శివపార్వతుల మూలవిరాట్‌లను ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు.

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని భుజంగేశ్వర స్వామి ఆలయం, మల్లికార్జున స్వామి ఆలయాలలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలలో భక్తులు సోమవారం పోటెత్తారు. పౌర్ణమిని పురస్కరించుకొని మహిళలు తెల్లవారుజాము నుంచే కార్తీక దీపాలు వెలిగించి స్వాముల వారికి అభిషేకాలు నిర్వహించారు.

పెనగలూరు : మండలంలోని శివాలయాలు సోమవారం వేకువజాము నుంచే శివనామస్మరణలతో మార్మోగాయి. కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి ఒకేసారి రావడంతో భక్తులు శివాలయాలకు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొండూరు శివాలయంలో మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, తనయుడు వైస్ ఎంపీపీ కొండూరు విజయ రెడ్డిలు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పవిత్ర ఆధ్యాత్మిక మాసం కార్తీకం

రామాపురం : కార్తీక మాసం పవిత్ర ఆధ్యాత్మిక మాసమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రెండవ కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని హసనాపురంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించి సత్కరించారు. మాట్లాడుతూ పౌర్ణమి నాటి చంద్రుడు కృత్రిమ నక్షత్రం సమీపంలో ఉడటం వల్ల ఈ మాసానికి కార్తీక మాసంగా పేరు వచ్చిందన్నారు. కార్తీక సోమవార వ్రతాన్ని ఆచరించినవారు కైలాసాన్ని చేరుకుంటారని కార్తీక పురాణం చెబుతోందన్నారు. పరమశివుని కరుణా కటాక్షాలతో వర్షాలు సంవృద్ధిగా కురవాలని రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆయన ప్రార్థించారు. కార్యక్రమంలో పప్పిరెడ్డి మహేశ్వరరెడ్డి, చలమారెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, పప్పిరెడ్డి హరినాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ హరినాథరెడ్డి, శివశంకర్, అజీం బాషా, శివయ్య, సాంబయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని శైవక్షేత్రాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని సిద్దిలేశ్వరస్వామి ఆలయంలో నీలకంఠేశ్వర స్వామిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని పూజలు నిర్వహించారు. గాదెల వెంకటాపురం గ్రామ శివాలయంలో, పున్నాటివారి పల్లె శివాలయం వద్ద భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేశారు.

అత్తిరాల క్షేత్రంలో..

రాజంపేట రూరల్ : కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో శివపార్వతుల కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని పాల్గొన్నారు. ముత్యాల తలంబ్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులతో కలిసి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులకు వైభవోపేతంగా కల్యాణాన్ని జరిపించారు. కాగా ఆదివారం రాత్రి, సోమవారం బహుదానది తీరం వద్ద మహిళలు కార్తీకదీపాలను వెలిగించారు.

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల వెంకటశివసాయి ఆలయం, సంబేపల్లె పశుపతినాథ ఆలయం, చిన్నజంగంపల్లె మల్లికార్జున ఆలయాలలో సోమవారం భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.


పుల్లంపేట: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


చిన్నమండెం: మల్లూరు క్రాస్ శివాలయంలో..


పెనగలూరు: పూజలు నిర్వహిస్తున్న ప్రభావతమ్మ


రాజంపేట: శివలింగం ఆకృతిలో కార్తీక దీపాలు


రాజంపేట రూరల్: ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మేడా


రామాపురం: ప్రత్యేక పూజల్లో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

చిత్రకళల అభివృద్ధికి చేయూత

– ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


గిరిధర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : పట్టణంలో చిత్రకళల అభివృద్ధికి ప్రభుత్వం తరపున చేయూతనందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎంసీ కళ్యాణ మండపంలో ప్రముఖ చిత్రకారుడు నాయని గిరిధర్ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని సోమవారం ఎమ్మెల్యే సందర్శించి విలేకరులతో మాట్లాడారు. పెద్దనగరాల్లోనే పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌ను చూడగలమని, అయితే చిన్నపట్టణమైన రాజంపేటలో మనసును హత్తుకునే పెయింటింగ్స్‌ను చూడటం ఒకింత ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇక్కడి గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రతి చిత్రంలో అనేక భావాలు పొందుపరచిబడి ఉన్నాయన్నారు. నగరాల్లో తప్ప జిల్లాల్లో ఎక్కడా ఆర్ట్ స్టూడియోలు లేవని, అందువల్ల గిరిధర్ ఈ ప్రాంతంలో చిత్రకళను అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తే చిన్నపాటి పరిశ్రమ తరహాలో స్టూడియో ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ ప్రతిభను మెచ్చుకొని ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగా శేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జెనుగు కృష్ణారావుయాదవ్, కసిరెడ్డి రాజారెడ్డి, తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎన్.ఈశ్వరయ్య, పాపినేని విశ్వనాథరెడ్డి, రేవరాజు శ్రీనివాసరాజు, పోలి మురళీరెడ్డి, జీవీ సుబ్బరాజు, వడ్డే శ్రీను పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలకే పశు ఆరోగ్య కార్డులు

చిట్వేలి : పశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తున్నట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ కేడీ వర ప్రసాద్ పేర్కొన్నారు. తిమ్మయ్యగారిపల్లి సర్పంచ్ ప్రసన్నకుమారి సహకారంతో సోమవారం తిమ్మయ్యగారిపల్లి, ఎస్సీ కాలనీ, చిల్లావాండ్లపల్లి గ్రామాలలో పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఏడీ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆరోగ్యకార్డులను తీసుకురావాలన్నారు. అందులో పశువుకు సంబంధించి వ్యాధి నిర్ధారణ, నివారణకు చేసే చికిత్సలను నమోదు చేయించుకోవాలన్నారు. తిమ్మయ్యగారిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో 50 పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేసినట్లు ఏడీ తెలియజేశారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు నరసింహులు, సుబ్బయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పథకాలు సద్వినియోగం చేసుకోండి

రామాపురం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి అన్నారు. మండలంలోని గోపగుడిపల్లె, సరస్వతిపల్లె, పంచాయతీలలో వీక్షిత్ భారత్ సంకల్పయాత్రను సోమవారం ఎంపీడీఓ హైదర్‌వలి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. మాట్లాడుతూ పీఎం కిసాన్, సీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, జీవన్ జ్యోతి తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరాన్ని సచివాలయాల వద్ద నిర్వహించారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్యాస్ కనెక్షన్ లేని నిరుపేద కుటుంబాలు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఎస్ఓ రఘురాం, ఐఓసీ ఎస్ఓ సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సరోజమ్మ, మునీర్ బాషా, ఈఓపీఆర్‌డీ ఉషారాణి, ఏఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ కనెక్షన్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

జగన్ పాలనలో అందరికీ సంక్షేమం

పెనగలూరు : మండల కేంద్రంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సుబ్బరాయుడు, రిటైర్డ్ పీఈటీ మాస్టర్ భాస్కర్ రెడ్డిలు పాల్గొని పార్టీ జెండాను, సంక్షేమ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎన్నో పథకాలు తీసుకొచ్చిందని వారు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ పథకాలు పొందని కుటుంబం లేదని చెప్పారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

హుండీ ఆదాయం లెక్కింపు

సిద్దవటం : లంకమల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం సాయంత్రం లెక్కించినట్టు ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు హుండీ కానుకలను లెక్కించగా రూ. 95,537 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయం చైర్మన్ కొండారెడ్డి, గంగమ్మ దేవత ఆలయం ఈఓ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం జగనన్న బీమా

నందలూరు (రాజంపేట) : పేదల పాలిట ఆపన్నహస్తం జగనన్న బీమా అని నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల తోటపాలెంకు చెందిన సయ్యద్ లహత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. అతని కుటుంబానికి రూ. 5 లక్షలు జగనన్న బీమా మంజూరైందని, ఇందులో భాగంగా సోమవారం రూ. 10 వేలు మృతుని కుటుంబానికి అందజేశామన్నారు. సచివాలయ వెల్ఫేర్ అధికారిణి లక్ష్మీ శరణ్య, సిబ్బంది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

సంబేపల్లె : చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని గంగన్నగారిపల్లెకు చెందిన అన్నయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో సంబేపల్లెలోని గ్రామీణ బ్యాంక్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి బోల్తాపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

గాలివీడు : మండల ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డైట్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కాల్వపల్లి క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా నాగేశ్వర్రావ్, కౌన్సిలర్‌గా మున్వర్‌బాషా, జగదీశ్వర్‌రెడ్డి, బి.వి.ఆర్ నాయక్, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నామని చెప్పారు.

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్టీయూ మండల అధ్యక్షుడు ధర్మారెడ్డి చెప్పారు. సోమవారం నిర్వహించిన ఎన్నికలలో ఆయన వీరబల్లె మండల అధ్యక్షుడిగా ధర్మారెడ్డిని ఎన్నుకున్నారు.

పరామర్శ

రామాపురం : ప్రమాదంలో గాయపడి కాలు విరిగి చికిత్స అనంతరం రాయచోటిలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని కుమ్మరపల్లె గ్రామ నివాసి, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు బసిరెడ్డిని సోమవారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించండి

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామక్రిష్ణ, ఎం.భాస్కరరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి డైట్ కళాశాలలో ఎస్టీయూ రాయచోటి రీజియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఏ, ఆర్జిత సెలవులు, మెడికల్ బిల్లుల బకాయిలను విడుదల చేసి ఉపాధ్యాయుల ఖాతాలలో జమచేయాలన్నారు. పర్యవేక్షణ నిబంధనలు పాటించకుండా ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని గందరగోళానికి గురిచేయడం తగదన్నారు. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.మధుసూదన్, రాష్ట్రకార్యదర్శులు ఆర్.వి.రమణ, శివారెడ్డి, ఆదినారాయణరెడ్డిలు ప్రసంగించారు. అనంతరం రాయచోటి, సంబేపల్లె, సుండుపల్లె, చిన్నమండెం, వీరబల్లి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలశాఖల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాయచోటి రీజియన్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, ఎన్నికల అధికారి వై.రవీంద్రనాథరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్. రవీంద్రనాథరెడ్డి, నేతలు మున్వర్‌బాషా, మురళీ, రఘు, రామాంజులు, శివశంకర్, బీమ్లా నాయక్, వెంకటరమణ, గోపిక్రిష్ణ, రామక్రిష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ

రాయచోటి అర్బన్ : పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ సాధ్యమవుతుందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న అన్నారు. సోమవారం పట్టణంలోని మాసాపేటలో ఉన్న శ్రీనివాస ఐటీఐలో పీడీఎస్‌యూ రాయచోటి పట్టణ నాలుగవ మహాసభలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువత సరైన ఉద్యోగావకాశాలు, ఉపాధి లేక ఇతరదేశాలకు వలసలు వెళ్లి నానా తిప్పలు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు స్పందించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వలసలకు అడ్డుకట్టవేయవచ్చునంటూ అన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీలో పాలకులు అలసత్వం వీడాలన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. అనంతరం పీడీఎస్‌యూ రాయచోటి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా గణేష్, కార్యదర్శిగా నిరంజన్, ఉపాధ్యక్షులుగా బాలచంద్ర, శ్రీధర్, అంజి, సహాయ కార్యదర్శులుగా చలపతి నాయుడు, చిన్నరెడ్డెయ్య, కోశాధికారిగా కిరణ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సతీష్, మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఇంటి స్థలం మంజూరు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు బస్ షెల్టర్ నిర్మాణం పనులకు స్థలం ఖాళీ చేసిన ఈశ్వరమ్మకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డిలు బాధితురాలికి ఇంటిపట్టా అందించారు. ఈ సందర్భంగా సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఈశ్వరమ్మ బజ్జీల దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తుండేదని, బస్ షెల్టర్ నిర్మాణం కొరకు ఖాళీ చేయమని కోరడంతో ఆమె ఖాళీ చేసిందన్నారు. దీంతో ప్రభుత్వం ఆమెకు రెండు సెంట్ల స్థలం మంజూరు చేసిందన్నారు. అంతకుముందు ఉదయం గ్రీవెన్స్‌లో సాయికిషోర్ రెడ్డి రైతుల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. బోటుమీదపల్లి అరుంధతివాడ గ్రామ ప్రజలకు శ్మశానానికి స్థలం కేటాయించాలని గ్రామస్తులు ద్వారా ఆయన తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, ఆర్ఐ రామ్మోహన్, వీఆర్ఓ మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలూరు సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఈశ్వరమ్మకు ఇంటిపట్టాను అందజేస్తున్న దృశ్యం

రెడ్డివారిపల్లె ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు : ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు స్వగ్రామం రెడ్డివారిపల్లెలోని శ్రీ హరి బాలశక్తి మౌనీశ్వర్‌స్వామి ఆశ్రమంలో సోమవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నయ్య, గంగయ్య, సుబ్బరాయుడు, నాగయ్య ఆధ్వర్యంలో ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు. ఆశ్రమంలోని శివలింగ అభిషేకం, నాగుల పుట్టకు పూజలు, సత్యనారాయణస్వామికి అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శంకరయ్య, చిన్న చెంచయ్య, సిద్దయ్య, మనోజ్, జనార్ధన, ప్రసాద్, శశి, నర్సరామయ్య, బాలాజీ ప్రజలు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు